సాక్షి పెద్దపల్లి

ఆదివారం । 9 । జూన్ । 2024



పరీక్ష కేంద్రాల తనిఖీ

గోదావరిఖనిటౌన్/రామగిరి/జ్యోతినగర్: జిల్లాలో ఏర్పాటు చేసిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలను నోడల్ అధికారి, అదనపు కలెక్టర్ అరుణశ్రీ శనివారం తనిఖీ చేశారు.



నృసింహునికి పూజలు

యైటింక్లయిన్‌కాలనీ: బ్యారేజీ పరిశీలనకు వచ్చిన సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ సుందిళ్ల శ్రీలక్ష్మీనృసింహస్వామిని శనివారం దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
40.0 /33.9

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం ఎక్కువగా నమోదవుతుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

శ్రీవారిని దర్శించుకున్న ఎంపీ



ఆలయం ఎదుట ఎంపీ వంశీకృష్ణ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ఎంపీగా ఎన్నికైన గడ్డం వంశీకృష్ణ, తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. తన తండ్రి, చెన్నూరు ఎమ్మెల్యే జి.వివేక్‌తోపాటు కుటుంబసభ్యులు ఆయన వెంట ఉన్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్: తెలంగాణ శ్రీవైష్ణవ సేవా సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కాందూరి వాసు తెలిపారు. జూలైలో జరిగే రాష్ట్ర రజతోత్సవాల సందర్భంగా పురస్కారాలు అందిస్తామన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో చూపిన ప్రతిభ ధ్రువీకరణ పత్రాలు, పూర్తి చిరునామాతోపాటు మార్కుల మెమో జతచేసి ఈనెల 30లోగా తెలంగాణ శ్రీవైష్ణవ సదనం, రోడ్డు నంబరు 5, చంద్రపురికాలనీ, ఎల్బీనగర్, హైదారాబాద్– 500074 చిరునామాకు పోస్టు ద్వారా పంపించాలని, లేదా జిల్లా అధ్యక్షుడికి దరఖాస్తులు అందించాలని ఆయన కోరారు.

నేడు, రేపు భాషా పండితుల పత్రాల పరిశీలన

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని తెలుగు, హిందీ భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల ధ్రువపత్రాలను ఈనెల 9, 10వ తేదీల్లో పరిశీలిస్తారని జిల్లా విద్యాధికారి మాధవి శనివారం తెలిపారు. పెద్దపల్లి మండల విద్యావనరుల కేంద్రంలో ఉదయం 10గంటల నుంచి అందుబాటులో ఉంటారన్నారు. ఒరిజినల్ సర్వీస్ బుక్, సర్టిఫికెట్లు, ర్యాంకు కార్డు, అపాయింట్‌మెంట్ ఆర్డర్లు, రెండుసెట్ల జిరాక్స్‌లతో హాజరు కావాలని డీఈవో సూచించారు.

టెన్త్ పరీక్షకు 59మంది హాజరు

పెద్దపల్లిరూరల్: జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పదో తరగతి భౌతిక, రసాయ శాస్త్రం సప్లిమెంటరీ పరీక్షకు 59మంది విద్యార్థులు హాజరయ్యారని డీఈవో మాధవి తెలిపారు. 79 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 20 మంది గైర్హాజరయ్యారని డీఈవో వివరించారు.

కార్మిక సంఘం ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో కాంట్రాక్ట్ కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు యాజమాన్యం ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈమేరకు శనివారం కంపెనీ అధికారులు నోటీస్‌బోర్డుపై ఉత్తర్వుల కాపీ అంటించారు. కార్మిక సంఘం కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించేందుకు కంపెనీ సుముఖంగా ఉందని అందులో పేర్కొన్నారు. ప్రత్యక్ష బ్యాలెట్ పద్ధతిన ప్రధాన కార్యదర్శి పదవికి ఎన్నికలు నిర్వహిస్తారు. ఆసక్తిగల కార్మికులు ఈనెల10వ తేదీన కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరుకావాలన్నారు. ఇందులో ఎన్నికల నిర్వహణ విధివిధానాలపై చర్చించనున్నట్లు వివరించారు. ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ రావడంతో కంపెనీలో కోలాహలం మొదలైంది.

ప్రభుత్వ స్కూళ్లలో చేరాలి



మాట్లాడుతున్న డీఈవో మాధవి

సుల్తానాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని జిల్లా విద్యాధికారి మాధవి అన్నారు. ఐతరాజుపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం చేపట్టిన బడిబాట సందర్భంగా డీఈవో మాట్లాడారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, నోట్‌బుక్స్ ఉచితంగా అందిస్తూ, స్కూళ్లలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సురేందర్, ఎంఎన్‌వో దివాకర్, హెచ్‌ఎం కవిత, పంచాయతీ కార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు.

‘టోల్’ తీస్తున్న మట్టిరోడ్డు

- తొలగించిన కొద్దీ నిర్మిస్తున్న వైనం
- మానేరులో అక్రమార్కుల దందా
- ఇసుక అక్రమ రవాణాకు సులభమైన మార్గం
- రూ.కోట్లు కురిపిస్తున్న అనధికారిక వేలం
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



నిర్వాహకులు ఇస్తున్న రశీదు



మానేరులో నిర్మించిన మట్టిరోడ్డుపై అనధికారిక టోల్‌గేట్ ఇదే..

ముత్తారం(మంథని): ఓడేడ్ – గర్మిళ్లపల్లి మధ్య ఉన్న మానేరు ఇసుకాసురులకు రూ.కోట్లు కురిపిస్తోంది. ఇక్కడ అధికారిక రీచ్‌ల కన్నా.. అనధికారిక ఇసుక రీచ్‌లతోనే అక్రమార్కుల పంట పండుతోంది. పెద్దపల్లి – జయశంకర్ భూపాలపల్లి జిల్లాల సరిహద్దుల్లోని ముత్తారం మండలం ఓడేడ్ – టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి మధ్య మానేరు ఉండడంతో తమ పరిధి కాదంటే తమ పరిధి కాదని అధికారులు పెద్దగా శ్రద్ధ చూడడంలేదు. దీంతో కొందరు మానేరులో తాత్కాలికంగా మట్టిరోడ్డు నిర్మించారు. రాకపోకలు సాగించే ఇసుక లారీల నుంచి టోల్‌ట్యాక్స్ వసూలు చేస్తున్నారు.

ట్యాక్స్ వసూళ్లకు వేలం పాట..

మానేరు సమీపంలోని ఓడేడ్, గర్మిళ్లపల్లివాసులు ఏటా రూ.15 లక్షల – రూ.23లక్షల వరకు వేలం పాడి టోల్‌ట్యాక్స్ వసూలు చేసుకుంటున్నారని తెలిసింది. ఈఏడాది గర్మిళ్లపల్లికి చెందిన ఓ వ్యక్తి రూ.14లక్షలకు వేలం పడి ట్యాక్స్ వసూలు హక్కులు దక్కించుకున్నారని అంటున్నారు. ‘రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు’ పేరిట రశీదు ముద్రించి అక్రమంగా వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. మానేరుపై వంతెన అసంపూర్తిగా మిగిలిపోవడం అక్రమార్కులకు వరంగా మారింది.

పరిధి దాటితే దృష్టి మళ్లించొచ్చని..

టోల్‌ట్యాక్స్ నిర్వాహకులు ఇసుక అక్రమ రవాణా, టోల్‌ట్యాక్స్ వసూళ్లకు అధికారుల నుంచి ఆటంకాలు ఎదురవకుండా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. పరిధి దాటి టోల్‌గేట్ ఏర్పాటు చేస్తే రెండు జిల్లాల అధికారులు తమ పరిధి కాదంటూ ఇటువైపు కన్నెత్తి చూడరని, తద్వారా తమ దందా యథేచ్ఛగా సాగించవచ్చని భావిస్తున్నారు. ఈక్రమంలో టోల్‌ట్యాక్స్ యథేచ్ఛగా వసూలు చేస్తున్నారు. అయితే, మానేరులోని మట్టిరోడ్డుపై రాకపోకలు సాగించే ఇసుక లారీల మాటున కొందరు స్మగ్లర్లు గంజాయి కూడా తరలిస్తున్నారని తెలిసింది. ఈ విషయంలో ఇప్పటికే డయల్ 100కు అనేక ఫిర్యాదులు వెళ్లినా స్పందన రావడం లేదంటున్నారు.

వాహనాన్ని బట్టి రేటు..

మానేరులోని మట్టిరోడ్డుపై ఏర్పాటు చేసిన టోల్ గేట్ వద్ద వాహనం తీరును బట్టి రేటు ఫిక్స్ చేశారు. బైక్‌కు రూ.30, కారుకు రూ.100, లారీ, వ్యాన్‌కు రూ.500, ఇసుక లారీకి రూ.1,000 చొప్పున వసూలు చేస్తున్నారని తెలుస్తోంది. ఇలా రోజూ సుమారు రూ.50,000 – రూ.70,000 వరకు ఆర్జిస్తున్నారని స్థానికులు అంటున్నారు.

మట్టిరోడ్డు తొలిగించినా..

మట్టిరోడ్డు ముసుగులో సాగుతున్న అక్రమాల నేపథ్యంలో ఫిర్యాదులు అందడంతో పెద్దపల్లి జిల్లా రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, పంచాయతీ అధికారులు మార్చి 18న మట్టి తొలగించారు. ఐదారు రోజుల తర్వాత నిర్వాహకులు మళ్లీ మట్టిరోడ్డు వేసుకున్నారు. ఆగ్రహించిన అధికారులు.. మార్చి 25న అనుమతిలేని రెండు ఇసుక లారీలు, జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. అక్రమార్కులపై ముత్తారం ఎస్సై మధూసూదన్‌రావు కేసు నమోదు చేశారు. కానీ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధికారులు ఇప్పటికీ స్పందించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

హైకోర్టుకు చేరిన పంచాయితీ..

అనుమతి లేకుండా మట్టిరోడ్డు నిర్మించారని, టోల్‌ట్యాక్స్ వసూలు చేస్తున్నారని పేర్కొంటూ మంథనికి చెందిన ఓ వ్యక్తి 2022లో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై విచారణ చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఆదేశాలు వచ్చాయి. రెండు జిల్లాల కలెక్టర్లు, పంచాయతీ, పోలీసు, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో అక్రమాలు అరికట్టాలని సూచనలు వచ్చాయి. అయినా, ఇసుక అక్రమ రవాణా, టోల్‌ట్యాక్స్ వసూలు ఆగడంలేదు. ఈవిషయం ఎంపీడీవో లలితను సంప్రదించగా, అక్రమంగా మట్టిరోడ్డు నిర్మించిన విషయంపై గ్రామ కార్యదర్శికి నోటీసులు జారీచేస్తామన్నారు.

విచారణ జరిపిస్తాం

ఓడేడ్ మానేరులో అక్రమంగా మట్టిరోడ్డు నిర్మించి టోల్‌ట్యాక్స్ వసూలు చేస్తున్నారనే సమాచారం మా వద్ద ఉంది. ఈ మార్గంలో లారీల్లో ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారని ఫిర్యాదులు కూడా వచ్చాయి. దీంతో పోలీసు, ఇరిగేషన్, పంచాయతీ అధికారుల సహకారంతో ఇటీవల మట్టిరోడ్డు తొలగించాం. కొద్దిరోజులకే మళ్లీ రోడ్డు నిర్మించారని తెలిసింది. దీనిపై విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటాం. అయితే, అది పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పరిధి కావడంతో సమస్య తలెత్తుతోంది.

– సుమన్, తహసీల్దార్, మంథని

బడిబాట పట్టిస్తాం



- తొలిరోజే పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేస్తాం
- ప్రభుత్వ పాఠశాలల్లో స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు
- తల్లిదండ్రులూ ఆలోచించండి
- పిల్లలను సర్కార్ పాఠశాలల్లో చేర్పించండి
- జిల్లా విద్యాధికారి మాధవి

సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి, పెద్దపల్లి: ‘బడిబాట సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటా పర్యటిస్తున్నారు. బడీడు పిల్లలను గుర్తించి స్కూళ్లలో చేర్పిస్తున్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడుల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. గతేడాది ప్రైవేట్ పాఠశాలల్లో 86శాతం ఉత్తీర్ణత నమోదవగా.. ప్రభుత్వ స్కూళ్లలో 96.36 ఉత్తీర్ణతశాతం సాధించాం. ఫలితాలు, సౌకర్యాలు, వసతులు పరిశీలించండి.. మీ పిల్లలను సర్కారు పాఠశాలల్లో చేర్పించండి’ అని జిల్లా విద్యాధికారి మాధవి తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పాఠశాలల పునఃప్రారంభం నేపథ్యంలో ‘సాక్షి’కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో డీఈవో మాధవి పలు విషయాలు వెల్లడించారు.

గ్రామాల్లో బడిబాట ఎలా సాగుతోంది?

డీఈవో : ఈనెల ఆరు నుంచి 19వ తేదీ వరకు బడిబాట నిర్వహిస్తున్నాం. గ్రామాల్లో బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేలా విస్తృత ప్రచారం చేస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే కలిగే ప్రయోజనాల గురించి వివరిస్తూ తల్లిదండ్రులు ఆకర్షితులయ్యేలా.. ప్రైవేట్ పాఠశాలల్లో చేరితే రూ.50వేల నుంచి రూ.లక్ష ఖర్చవుతుంది. ఆ డబ్బు ఆదాచేసి మీ పిల్లల ఉన్నత చదువులకు వినియోగించండి.. మీ డబ్బులు మీ వద్దే.. మీ పిల్లల భవిష్యత్ మా వద్ద.. నినాదంతో ప్రచారం చేస్తున్నాం. ఉచిత పుస్తకాలు, యూనిఫామ్స్, ఆరోగ్య పరీక్షలు, ఉదయం రాగిజావ, మధ్యాహ్నం సన్నబియ్యంతో కూడిన భోజనం, వారంలో మూడు రోజులు గుడ్లు, డిజిటల్ తరగతి గదులు తదితర వాటి గురించి వివరిస్తున్నాం. ప్రధానంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్లే స్కూల్ విద్యార్థులను సర్కారు బడుల్లో చేరేలా అవగాహన కల్పిస్తున్నాం.

టీసీ ఇవ్వడానికి కొన్ని ప్రైవేట్ స్కూళ్లు ఇబ్బంది పెడుతున్నాయి?

డీఈవో: విద్యాహక్కు చట్టం ప్రకారం టీసీ లేకుండా ప్రవేశాలు తీసుకోరాదు. ప్రైవేట్ యాజమాన్యాలు ఇబ్బంది పెడితే మా దృష్టికి తీసుకురండి. సమస్య పరిష్కరిస్తాం.

మన ఊరు –మన బడి కింద ఎంపిక చేసిన పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి?

డీఈవో: తొలిదశలో 191 పాఠశాలలను ఈ పథకం కింద ఎంపిక చేశాం. దాదాపు 35 స్కూళ్లలో పనులు పూర్తిచేశాం. మరికొన్నింటిలో పనులు ప్రగతి దశలో ఉన్నాయి. రూ.7కోట్లతో బిల్లింగ్ చేసి ప్రభుత్వానికి సమర్పించాం. ఎన్నికల కోడ్ ముగియడంతో నిధులు మంజూరవుతాయి. నిధులు రాగానే పనులు పూర్తిచేస్తాం.

పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ జిల్లాకు చేరాయా? పంపిణీ ఎప్పటివరకు పూర్తవుతుంది?

డీఈవో: జిల్లాకు అవసరమైన 2.40లక్షల పాఠ్య పుస్తకాలు వచ్చాయి. అభ్యసన దీపిక, టీచర్స్ గైడ్, వర్క్‌బుక్, నోట్‌పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయి. వీటన్నింటినీ మండల కేంద్రాలకు తరలించాం. అక్కడి నుంచి పాఠశాలలకు చేరవేసి తొలిరోజే విద్యార్థులకు అందిస్తాం.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు ఎలా ఉన్నాయి?

డీఈవో: గతేడాది ఐదు స్కూళ్లలో కిచెన్ గార్డెన్స్ పేరిట న్యూట్రిషన్ ఫుడ్ అందించాం. ఈఏడాది 25 పాఠశాలలకు విస్తరిస్తాం. ప్రతీనెల టీచర్లు, పేరెంట్స్ మీటింగ్ నిర్వహించి, సలహాలు స్వీకరిస్తాం. నాణ్యమైన విద్యాబోధన చేస్తాం. థెకో ఇండియా ప్రోగ్రాం కింద ఎండకాలంలో డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి వారి గ్రామాల్లో సుమారు 40 వేసవి శిబిరాలు నిర్వహించాం. ఈసారి స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు బోధిస్తాం. ట్యాబ్స్ ద్వారా విద్యార్థులు, టీచర్స్ హాజరును ఫొటో క్యాప్చర్ ద్వారా ఆన్‌లైన్‌లో రోజూ నమోదు చేస్తున్నాం.

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టే అభివృద్ధి పనులు ఏమిటి?

డీఈవో : జిల్లాలో 535 పాఠశాలలుండగా 291 స్కూళ్లలో సుమారు రూ.7.40కోట్లతో ఆదర్శ కమిటీల ద్వారా అభివృద్ధి పనులు పూర్తిచేశాం. వీటి ద్వారా మూత్రశాలలు, ఫ్యాన్లు, ట్యూబ్‌లు, కిటీకీలు బిగించాం. పంచాయతీల సిబ్బంది సహకారంతో పారిశుధ్య పనులు చేపట్టాం.

సబ్జెక్టు టీచర్ల కొరతతో విద్యాబోధన ఎలా సాగుతుంది?

డీఈవో: కొరత ఉన్న ప్రాంతాల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తాం. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా బోధన చేయిస్తాం. ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన బదిలీలు, పదోన్నతులతో టీచర్ల కొరత తీరుతుంది.

15వేల మంది అభ్యర్థులు.. 41 పరీక్ష కేంద్రాలు

- గ్రూప్–1కు పకడ్బందీ బందోబస్తు
- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



శ్రీనివాస్

గోదావరిఖని: పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో ఆదివారం నిర్వహించే గ్రూప్–1 పరీక్షకు పకడ్బందీ బందోబస్తు చేపట్టామని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ శనివారం తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో 6,098 మంది అభ్యర్థులకు 14, మంచిర్యాల జిల్లాలో 9,384 మందికి 27 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారని వివరించారు. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరని పేర్కొన్నారు.

144 సెక్షన్ అమలు

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీ పీఎస్సీ) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రూప్ – వన్ ప్రిలిమినరీకి రెండు జిల్లాల్లోని 41 సెంటర్లలో 15,482 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తారని, వీరికి అసౌకర్యం కలుగకుండా పట్టణ ప్రధాన రోడ్లు, చౌరస్తాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేశామని సీపీ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరిసరాల్లో సభలు, ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించ కూడదన్నారు. జిరాక్స్ సెంటర్లు తెరిచి ఉంచరాదని సూచించారు. బయోమెట్రిక్ విధానం ద్వారా అభ్యర్థుల హాజరు నమోదు చేస్తారన్నారు. అభ్యర్థులు బయోమెట్రిక్, వెరిఫికేషన్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

అభ్యర్థులకు సూచనలు

- ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు.
- ఉదయం 10 గంటలకు పరీక్ష కేంద్రం గేట్ మూసివేస్తారు.
- ఆ తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించరు.
- హాల్ టికెట్‌పై ఉన్న నియమనిబంధనలు పాటించాలి.
- హాల్ టికెట్‌తోపాటు ఒక కలర్ ఫొటో, ఒరిజినల్ ఆధార్/డ్రైవింగ్ లైసెన్స్/ఉద్యోగి గుర్తింపు/ఓటరు గుర్తింపుకార్డుల్లో ఏదైనా ఒకటి తప్పనిసరి వెంట తీసుకెళ్లాలి.

పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు

జిల్లా	పరీక్ష కేంద్రాలు	అభ్యర్థులు
పెద్దపల్లి	14	6,098
మంచిర్యాల	27	9,384

- హాల్‌టికెట్‌పై ఫొటో సరిగ్గా కనిపించకుంటే మూడు కలర్ ఫొటోలు తీసుకొని, హాల్ టికెట్‌పై గెజిటెడ్ అధికారి సంతకం చేయించుకోవాలి.
- కేటాయించిన పరీక్ష కేంద్రాన్ని ముందుగానే చూసుకుంటే పరీక్షరోజు సులభంగా చేరుకోవచ్చు.
- బ్లాక్ లేదా బ్లూబాల్ పెన్నునే పరీక్ష రాసేందుకు అనుమతిస్తారు.
- మొబైల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్, కాలిక్యులేటర్, వైట్ పేపర్, పెన్‌డ్రైవ్, ట్యాబ్, హియరింగ్ సొల్యూషన్స్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరు.
- పరీక్ష ముగిసినా.. ఒంటిగంట వరకు పరీక్ష కేంద్రం నుంచి బయటకు పంపించరు.
- పరీక్ష రాశాక ప్రశ్నాపత్రం తమతోపాటు తీసుకెళ్లవచ్చు.
- మాల్‌ప్రాక్టీస్, మాస్‌కాపీంగ్ పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటారు.

ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

- నేడు గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష
- జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేశాం
- రీజినల్ కో ఆర్డినేటర్ లక్ష్మీనర్సయ్య



లక్ష్మీనర్సయ్య, కో ఆర్డినేటర్

పెద్దపల్లిరూరల్: గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణకు జిల్లాలో అవసరమైన అన్నిఏర్పాట్లు పూర్తిచేశామని రీజినల్ కో ఆర్డినేటర్ లక్ష్మీనర్సయ్య తెలిపారు. ఆదివారం చేపట్టిన పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. 10గంటల తర్వాత అనుమతించబోమని స్పష్టం చేశారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఐడీ కార్డు, మూడు ఫొటోలు వెంటతెచ్చుకోవాలని సూచించారు. షూ ధరించొద్దని, బయోమెట్రిక్ అటెండెన్స్ ఉన్నందున అభ్యర్థులు మెహందీ, కోన్‌లాంటివి లేకుండా చూసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, చేతిగడియారం, సెల్‌ఫోన్ అనుమతించబోమని వివరించారు.

14కేంద్రాలు. 6,098మంది అభ్యర్థులు

జిల్లాలో గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షకు 14 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 6,098మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని రీజినల్ కో ఆర్డినేటర్ తెలిపారు. పెద్దపల్లిలో 6 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే రామగుండంలో 5, సుల్తానాబాద్‌లో 2, రామగిరిలో 1 పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు అందరూ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియమాలను కచ్చితంగా పాటించాలని ఆయన సూచించారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి

- ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్

గోదావరిఖని: ఈ వర్షాకాలంలో ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్ కోరారు. శనివారం జీడీకే–5 ఓసీపీని సందర్శించి ప్లాన్ పరిశీలించారు. అండర్ గ్రౌండ్ గ్యాలరీల్లో పని తీరు పరిశీలించి చేపట్టాల్సిన ప్రణాళికల గురించి అధికారులు, సిబ్బందికి సూచనలు, సలహాలిచ్చారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా గురించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కోల్‌బెంచ్‌లు, ఫైర్‌ఫైటింగ్ విధానం గురించి చర్చించారు. ఉపరితల గని పరిసర ప్రాంతాల్లో దుమ్ము, ధూళి లేవకుండా ఎప్పటికప్పుడు నీరు చల్లించాలని ఆదేశించారు. డైరెక్టర్ వెంట ఆర్జీ–1 జీఎం శ్రీనివాస్, అధికారులు చంద్రశేఖర్, ఎన్‌వీరావు, అనిల్ గబాలే, వీరారెడ్డి తదితరులు ఉన్నారు.

20వేల కేసులు పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

పెద్దపల్లిరూరల్: పెండింగ్ కేసుల్లో ఇరువర్గాలు రాజీకి రావడమే మేలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్‌కుమార్ అన్నారు. జిల్లాన్యాయస్థానంలో శనివారం సీనియర్ సివిల్‌జడ్జి స్వరూపరాణితో కలిసి నిర్వహించిన లోక్ అదాలత్‌లో 20,746 కేసులు పరిష్కరించినట్లు హేమంత్‌కుమార్ తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకున్న వారికి ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని ఆయన పేర్కొన్నారు. ట్రాఫిక్ చలాన్లకు సంబంధించిన 18,924 కేసులు, విద్యుత్ సంబంధిత 34, సైబర్‌క్రైం 13 కేసులు ఈ సందర్భంగా పరిష్కరించినట్లు ప్రధాన న్యాయమూర్తి వివరించారు. పరిహారం కింద రూ.1,08,63,738 చెల్లించారని ఆయన పేర్కొన్నారు. పెద్దపల్లి న్యాయస్థానం పరిధిలో 694, గోదావరిఖనిలో 704, మంథనిలో 269, సుల్తానాబాద్‌లో 106 కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్, సంకీర్తన, పెద్దపల్లి బార్‌అసోసియేషన్ ప్రతినిధులు సత్యనారాయణరెడ్డి, రమాదేవి, సంతోష్, మార కిశోర్ పాల్గొన్నారు.

తండ్రి చెంతకు కూతురు..

లోక్‌అదాలత్ కుదిర్చిన రాజీ ద్వారా ఓ కూతురును తండ్రి చెంతకు చేర్చింది. పెద్దపల్లి మండలం రాంపల్లికి చెందిన కన్నం రమ్యను కాల్వశ్రీరాంపూర్ మండలం గుడ్లపల్లికి చెందిన సతీశ్‌కు ఇచ్చి వివాహం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న రమ్య పాపాకు జన్మనిచ్చి కన్నుమూసింది. ఆ తర్వాత ఇరు కుటుంబాల మధ్య ఏర్పడ్డ కలహాలతో చిన్నారి అమ్మమ్మ వద్దే ఉంటోంది. కూతురును ఇప్పించాలంటూ తండ్రి సతీశ్ కోర్టును ఆశ్రయించాడు. దీంతో లోక్‌అదాలత్‌లో ఇరువర్గాలు రాజీపడడంతో పాపను తండ్రి సతీశ్ అక్కున చేర్చుకున్నాడు.

35శాతం వాటా ప్రకటించాలి

- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్



వినతిపత్రం అందిస్తున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: సింగరేణి సంస్థ సాధించిన లాభాల్లో 35శాతం కార్మికులకు వాటాగా చెల్లించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కోరారు. శనివారం సంస్థ సీఎండీ బలరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. 2023–2024 ఆర్థిక సంవత్సరం ముగిసి రెండు నెలలు కావస్తున్నా ఎన్నికల కోడ్‌తో ఇప్పటి వరకూ లాభాల వాటా ప్రకటించలేదని పేర్కొన్నారు. కోడ్ ముగిసిన నేపథ్యంలో వెంటనే లాభాల వాటా ప్రకటించాలని ఆయన కోరారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 67.13 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తే రూ.33వేల కోట్ల టర్నోవర్ సాధించి, రూ.2,222 కోట్ల లాభాలు ఆర్జించిందని అన్నారు. అందులో 32 శాతం కార్మికులకు లాభాల వాటాగా రూ.711.18 కోట్లు చెల్లించారని గుర్తుచేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో కార్మికులు మరింత శ్రమించి రికార్డుస్థాయిలో 70.12 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేశారని, రూ.37 వేల కోట్ల టర్నోవర్ సాధించామని అన్నారు. గతంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో రికార్డుస్థాయి ఉత్పత్తి సాధించిన కార్మికుల కోసం ఈసారి లాభాల వాటా 35శాతం ప్రకటించాలని ఆయన సీఎండీని కోరారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

సైదాపూర్(హుస్నాబాద్): మండలంలోని వెన్నంపల్లికి చెందిన కస్తూరి బ్రహ్మచారి(75) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై ఆరోగ్యం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం .. బ్రహ్మచారికి ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు నరేంద్రాచారి ఏడేళ్ల క్రితం మృతిచెందాడు. దీంతో బ్రహ్మచారి మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం సాయంత్రం మద్యం మత్తులోనే క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం చనిపోయాడు. మృతుడి కూతురు విజయగిరి మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడు..

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): చికిత్స పొందుతూ ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. గోదావరిఖని కల్యాణ్‌నగర్‌కు చెందిన ఆకునూరి సుధాకర్(53) గత నెల 29న రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ఖాజిపల్లిలో భవన నిర్మాణ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి బంధువు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ పోలీసులు తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య



లచ్చవ్వ (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన ఎర్ర లచ్చవ్వ(65) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం .. లచ్చవ్వ కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. మనస్తాపానికి గురైన ఆమె శుక్రవారం రాత్రి తన కుమారుడు మోహన్ కౌలుకు తీసుకున్న భూమిలోని వ్యవసాయ బావిలో దూకింది. లచ్చవ్వ కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. వ్యవసాయ బావిలో చూడగా మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. అనారోగ్య సమస్యలతోనే తన తల్లి ఆత్మహత్య చేసుకుందని మృతురాలి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



రాయమల్లు (ఫైల్)

గన్నేరువరం(మానకొండూర్): మండలంలోని ఖాసీంపేట గ్రామానికి చెందిన జక్కనపెల్లి రాయమల్లు(42) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. రాయమల్లు సోదరి రామంచ సత్తవ్వ ఖాసీంపేటలోనే ఇంటి నిర్మాణం చేపట్టగా ఫ్లోరింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అతను శనివారం మోటార్‌కు సంబంధించిన వైరును ప్లగ్‌లో పెడుతూ విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

బావిలో పడి దినసరి కూలీ దుర్మరణం



మొగిలి మృతదేహం

సైదాపూర్(హుస్నాబాద్): ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి ఓ దినసరి కూలీ మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. సైదాపూర్ మండలంలోని గుజ్జులపల్లిలో లెంకలపల్లి శేరాలు వ్యవసాయ బావికి గాజులు పోయడానికి కండుగులకు చెందిన మెట్ట మొగిలి(45) శనివారం తన కుటుంబసభ్యులతో వచ్చాడు. ఇసుక, కంకర, సిమెంట్ ట్రాక్టర్‌లోనే కలిపాడు. బావి అంచున నిలబడి ట్రాక్టర్ డోర్ తీస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్, ఎస్సై ఆరోగ్యం పరిశీలించారు.

జాగిలానికి లాంఛనాలతో అంత్యక్రియలు

- రాజా సేవలు మరవులేనివి
- నివాళి అర్పించిన ఎస్పీ అఖిల్‌మహాజన్



పోలీస్ జాగిలం రాజాకు నివాళి అర్పిస్తున్న ఎస్పీ, పోలీస్ సిబ్బంది

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా పోలీస్‌శాఖలో 14 ఏళ్లు విధులు నిర్వహించి అనారోగ్యంతో మృతిచెందిన జాగిలం రాజాకు శనివారం పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు ఎస్పీ అఖిల్ మహాజన్ సిబ్బందితో కలిసి నివాళి అర్పించారు. సిరిసిల్ల శివారులోని తంగళ్లపల్లి మండలం తాడూర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ అఖిల్‌మహాజన్ మాట్లాడుతూ లాబ్రడార్ రిట్రీవర్ సంతతికి చెందిన జాగిలం రాజా హ్యాండ్లర్ మల్లేశంతో 2010లో ఐఐటీఏ మొయినాబాద్‌లో ఎనిమిది నెలలు శిక్షణ పొంది 14 ఏళ్లుగా సిరిసిల్లలో సేవలందించిందని గుర్తుచేశారు. వీఐపీ, వీవీఐపీల సందర్శన సమయంలో మందుపాతరలు గుర్తించడంలో చాకచక్యంగా వ్యవహరించిందని కొనియాడారు. అనంతరం రాజాకు పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆర్‌ఐలు యాదగిరి, మధుకర్, రమేశ్, రాజా హ్యాండ్లర్ మల్లేశం, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భార్యపై కోపంతో ఇంటికి నిప్పు

- కాలి, కూలిపోయిన పెంకుటిల్లు
- పక్కింటికి వ్యాపించిన మంటలు
- రాజన్నసిరిసిల్ల పద్మనగర్‌లో ఘటన



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

తంగళ్లపల్లి(సిరిసిల్ల): భార్యపై కోపంతో ఇంటిని తగులబెట్టిన ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. పద్మనగర్‌కు చెందిన వృద్ధుడు ముడారి బాలపోశయ్య అనే మత్స్యకారుడు ఇంటివద్ద చేపల ఫ్రై చేసి అమ్ముతూ భార్య రాజేశ్వరీతో కలిసి జీవిస్తున్నాడు. కాగా శనివారం మృగశిరకార్తె కావడంతో ఉదయం బయటకు వెళ్లి మద్యం సేవించి సాయంత్రం ఇంటికొచ్చాడు. ఈక్రమంలో దంపతులకు గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన బాలపోశయ్య మద్యం మత్తులో ఇంటిలో పెట్రోల్ చల్లి నిప్పంటించాడు. గమనించిన భార్య రాజేశ్వరీ ప్రాణభయంతో బయటకు పరుగెత్తింది. మంటలకు తాలలేక బాలపోశయ్య కూడా బయటకు పరుగులు తీశాడు. ఇంటి బయట నిలిపిన ద్విచక్రవాహనానికి మంటలు వ్యాపించడంతో కాలిపోయింది. అంతేకాకుండా మంటలు పక్కింటికి వ్యాపించడంతో వారి ఇల్లు కూడా కాలిపోయింది. స్థానికులు పోలీస్, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే మంటల వేడికి పెంకుటిల్లు కాలి, కూలిపోయింది. తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాతిపెట్టిన మృతదేహానికి పోస్టుమార్టం

- 6 రోజుల క్రితం టీకా వికటించి చిన్నారి మృతి
- తల్లిదండ్రుల ఫిర్యాదుతో స్పందించిన కలెక్టర్
- పాతిపెట్టిన మృతదేహం వెలికితీత



అన్విశ్రీ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వ ఆరోగ్య ఉపకేంద్రంలో చిన్నారికి వేసిన టీకాలు వికటించి మృతిచెందగా.. కలెక్టర్ ఆదేశాలతో పాతిపెట్టిన మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం చేశారు. ఈ సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో శనివారం సంచలనం రేపింది. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బుర్క రాకేశ్–రిషిత దంపతులకు రెండో కూతురు అన్విశ్రీ(4 నెలలు) గత నెల 29న స్థానిక ప్రభుత్వ సబ్ కేర్ సెంటర్‌లో నాలుగు నెలల వయస్సులో వేసే మూడు టీకాలు వేయించారు. వైద్యులు చెప్పినట్లే టీకాలు వేయడంతో చిన్నారికి జ్వరం వచ్చింది. రెండు రోజుల తర్వాత విరోచనాలు మొదలయ్యాయి. విరోచనాలు అధికం కావడంతో ఈనెల 3వ తేదీ ఉదయం ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే మరణించింది. టీకాలు వికటించే తమ కూతురు మృతిచెందిందని తల్లిదండ్రులు రాకేశ్–రిషిత ఈనెల 6వ తేదీన కలెక్టర్‌తోపాటు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో చిన్నారి మృతదేహాన్ని శనివారం వెలికి తీసి తహసీల్దార్ రాంచందర్, ఎస్సై రమాకాంత్ సమక్షంలో పోస్టుమార్టం చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో చిన్నారి మృతిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

ఆభరణాలకు మెరుగు పెడతామన్నవారిపై దాడి



మల్లవ్వ



అనుమానితులను ఠాణాకు తరలిస్తున్న స్థానికులు

కోనరావుపేట(వేములవాడ): ఆభరణాలకు మెరుగుపెడతామని వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఓ వృద్ధురాలిని మోసం చేసేందుకు ప్రయత్నించారని స్థానికులు ఆరోపించారు. వారిని పట్టుకొని చితకబాదారు. ఈ ఘటన కోనరావుపేట మండలంలోని మల్కపేటలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు శనివారం గ్రామంలోని కట్ల మల్లవ్వ వద్దకు వచ్చారు. బంగారు ఆభరణాలకు మెరుగుపెడతామని చెప్పారు. వారి మాటలు నమ్మిన ఆమె తన మెడలోని గొలుసును ఇస్తుండగా స్థానికులు అనుమానించి, అడ్డుకున్నారు. ఆ ఇద్దరిపై దాడి చేసి, గ్రామ పంచాయతీ కార్యాలయంలో బంధించారు. అనంతరం ఆటోలో ఠాణాకు తీసుకెళ్లి, పోలీసులకు అప్పగించారు.

జూలై 6 వరకు పలు రైళ్ల రద్దు

ఓదెల(పెద్దపల్లి): దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ – సిర్‌పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే పలు రైళ్లను జూలై 6వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో సిర్‌పూర్ కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, కాజీపేట నుంచి సిర్‌పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే రామగిరి రైళ్లు ఉన్నట్లు వివరించారు. సిర్‌పూర్ కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 23 నుంచి జూలై 6వరకు, రామగిరి రైలు ఈనెల 17నుంచి జూలై 6వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు ఉత్వర్వుల్లో పేర్కొన్నారు. మూడోలైన్ మరమ్మతుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని, ప్రయాణికులు సహకరించాలని అధికారులు కోరారు.

రేపటి నుంచి ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థలోని వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకోసం ఈనెల 10 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈమేరకు సింగరేణి ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సింగరేణి పర్సనల్, వెల్ఫేర్ జీఎం బీఆర్ దీక్షితులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఈఅండ్‌ఎం), మేనేజ్‌మెంట్ ట్రెయినీ(సిస్టం), జేఎంఈటీ, అసిస్టెంట్ ఫోర్‌మెన్ ట్రెయినీ(ఎలక్ట్రికల్), అసిస్టెంట్ ఫోర్‌మెన్(మెకానికల్), ఫిట్టర్‌ట్రెయినీ, ఎలక్ట్రీషియన్ ట్రెయినీ పోస్టుల్లో ఖాళీల భర్తీ కోసం దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 10న మధ్యాహ్నం 12గంటల నుంచి ఈనెల 29వ తేదీ సాయంత్రం 5గంటల వరకు ఆన్‌లైన్‌లో రఖాస్తు చేసుకోవాలన్నారు. వాస్తవానికి గతనెల 15న దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించాల్సి ఉండగా, సాంకేతిక కారణాలతో వాయిదా పడినట్లు ఆయన వివరించారు. అర్హులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సింగరేణి కార్మికుడికి గాయాలు

గోదావరిఖని(రామగుండం): సింగరేణి రామగుండం డివిజన్–2 పరిధిలోని ఓసీపీ–3 ప్రాజెక్టు ప్రతాపరుద్ర షావల్ వద్ద విద్యుత్ సర్క్యూట్ బ్రేకర్‌లో జరిగిన ప్రమాదంలో జనరల్ మజ్దూర్ శ్రవణ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. శనివారం శ్రవణ్‌కుమార్ ఎలక్ట్రీషియన్ హెల్పర్‌గా విధులకు హాజరయ్యాడు. సర్వే బృందం కేబుల్ నుంచి పొగ వస్తోందని అతనికి చెప్పింది. పరిశీలించేందుకు వెళ్తున్న శ్రవణ్‌కుమార్‌కు విద్యుత్ సర్క్యూట్ బ్రేకర్ ప్యానెల్‌లో ఒక్కసారిగా భారీ మంటలు లేచి అంటుకున్నాయి. దీంతో అతనికి గాయాలయ్యాయి. బాధితుడిని యైటింక్లయిన్‌కాలనీ డిస్పెన్సరీకి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం గోదావరిఖని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. కార్మిక సంఘాల నాయకులు అతన్ని పరామర్శించారు.

గీత కార్మికుడికి..

కమాన్‌పూర్(మంథని): మండలంలోని లింగాల గ్రామానికి చెందిన ఉయ్యాల గంగయ్య గౌడ్‌కు గాయాలయ్యాయి. శనివారం అతను కల్లు గీయడానికి తాటిచెట్టు ఎక్కుతూ జారి పడ్డాడు. తోటి గీత కార్మికులు 108కు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి, బాధితుడిని పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బీరుసీసాతో దాడి చేసిన వ్యక్తిపై కేసు

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో బీరుసీసాతో దాడి చేసి, ఒకరిని గాయపరచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. లక్ష్మీదేవిపల్లికి చెందిన చెన్నవేని శేఖర్, పిట్టల నాగరాజు శుక్రవారం స్థానిక వైన్స్‌కు వెళ్లారు. పర్మిట్ రూంలో మద్యం సేవిస్తుండగా ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. అదే గ్రామానికి చెందిన గంగాధరి రవి గొడవ పడొద్దని వారికి చెప్పాడు. దీంతో శేఖర్ ఆగ్రహించి, అతనిపై బీరుసీసాతో దాడి చేయగా గాయాలయ్యాయి. బాధితుడిని అక్కడున్నవారు ఆస్పత్రికి తరలించారు. రవి కుమారుడు హరీశ్ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆటోట్రాలీని ఢీకొని, కారు బోల్తా

- నలుగురికి స్వల్ప గాయాలు



బోల్తా పడిన కారు

జ్యోతినగర్(రామగుండం): ఆటోట్రాలీని ఢీకొని, ఓ కారు బోల్తా పడింది. వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాలకు చెందిన వ్యక్తులు గోదావరిఖనికి చెందిన శ్రవణ్ కారులో శనివారం హైదరాబాద్ వెళ్తున్నారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ రాజీవ్ రహదారి సమీపంలోకి రాగానే ఆటోట్రాలీని వెనక భాగంలో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు బోల్తా పడటంతో అందులో ఉన్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను స్థానికులు గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. ఎన్టీపీసీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, విచారణ చేపట్టారు.

బ్రెయిన్ ట్యూమర్ అనగానే భయపడొద్దు

- మెడికవర్ ఆస్పత్రి న్యూరోసర్జన్ డాక్టర్ బోగ వెంకటేశ్



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వెంకటేశ్

కరీంనగర్‌టౌన్: బ్రెయిన్ ట్యూమర్ అనగానే భయపడాల్సిన అవసరం లేదని మెడికవర్ ఆస్పత్రి న్యూరోసర్జన్ డాక్టర్ బోగ వెంకటేశ్ అన్నారు. వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే సందర్భంగా శనివారం కరీంనగర్‌లోని మెడికవర్ ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెదడులో ఏర్పడే ప్రతీ గడ్డను బ్రెయిన్ ట్యూమర్‌గానే పరిగణిస్తారని తెలిపారు. తీవ్రమైన తలనొప్పి, వాంతులు, మూర్ఛ రావడం, కంటి సమస్యలు, మాటలు సరిగా మాట్లాడలేకపోవడం, ప్రవర్తనలో మార్పు, మతిమరుపు వంటివి ఈ వ్యాధి లక్షణాలని పేర్కొన్నారు. ఇవి ఉన్నవారు డాక్టర్‌ని సంప్రదిస్తే బ్రెయిన్ ఎంఆర్ఐ లేదా సీటీ స్కాన్ చేయడం ద్వారా వ్యాధిని గుర్తిస్తారన్నారు. వీటిలో కొన్ని కేన్సర్‌తో సంబంధం ఉన్నవి, మరికొన్ని లేనివి ఉంటాయని, బయాప్సీ ద్వారా మాత్రమే కేన్సర్‌ను గుర్తించే వీలుంటుందని తెలిపారు. 20 ఏళ్ల క్రితం ట్యూమర్ సర్జరీకి, ఇప్పటికీ చాలా తేడా ఉందన్నారు. అధునాతన వైద్య పద్ధతుల ద్వారా 90 శాతం సర్జరీలు విజయవంతంగా చేయగలుగుతున్నామని పేర్కొన్నారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిమల్లారెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, హెచ్ఆర్ మేనేజర్ ఈశ్వర్, ఆపరేషన్స్ మేనేజర్ సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల సభ్యుల బైఠాయింపు

- సీఐ కార్యాలయ ఆవరణలో నిరసన
- వీవో అధ్యక్షురాలు వాడుకున్న డబ్బులు చెల్లించేలా చూడాలని వినతి



బైఠాయించిన మహిళా సంఘాల సభ్యులు

జగిత్యాలరూరల్: మహిళా సంఘాల పేరిట తీసుకున్న రుణాల్లో అవకతవకలు జరిగాయని, వీవో అధ్యక్షురాలు తీసుకున్న డబ్బులు చెల్లించేలా చూడాలంటూ ఆయా సంఘాల సభ్యులు జగిత్యాల రూరల్ సీఐ కార్యాలయానికి వచ్చారు. అక్కడే బైఠాయించి, నిరసన తెలిపారు. బాధితుల వివరాల ప్రకారం.. వంజరిపల్లి గ్రామానికి చెందిన మహిళా సంఘాలకు గతంలో రుణాలు మంజూరయ్యాయి. సభ్యులు వాటిని తీసుకోకపోవడంతో వీవో అధ్యక్షురాలే వాడుకుంది. తిరిగి చెల్లించకపోవడంతో ఆయా సంఘాల లావాదేవీలు నిలిచిపోయాయి. బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడంతో ఏడాదిగా తరచూ వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి మహిళా సంఘాల సభ్యులు వీవో అధ్యక్షురాలి ఇంటికి వెళ్లి, వాడుకున్న డబ్బులు చెల్లించాలని గొడవకు దిగారు. శనివారం జగిత్యాల రూరల్ సీఐ కార్యాలయానికి వెళ్లి, బైఠాయించారు. సీఐ ఆరిఫ్ అలీఖాన్, ఎస్సై సదాకర్ వారితో మాట్లాడగా డబ్బులు చెల్లించేలా చూడాలని విన్నవించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, డబ్బులు రికవరీ చేయాలని డీఆర్డీఏ అధికారులను ఉన్నతాధికారులు ఆదేశించారు.

బెదిరించిన వ్యక్తులపై కేసు

జగిత్యాల క్రైం: ఓ వ్యక్తిని బెదిరించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వంజరిపల్లి గ్రామంలో మహిళా సంఘాల డబ్బుల్లో అవకతవకలపై శుక్రవారం యాదవ సంఘం సభ్యుల సమక్షంలో పంచాయితీ జరిగింది. అదేరోజు రాత్రి బొల్లె మోహన్, బొల్లె మల్లేశ్ గడ్డం రాజయ్య ఇంటికి వెళ్లి, తలుపులు కొడుతూ ఇష్టం వచ్చినట్లు తిట్టి, బెదిరింపులకు పాల్పడ్డారు. బాధితుడు శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ కరీంనగర్



చాంపియన్‌షిప్ సాధించిన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్: హనుమకొండలో ఈ నెల 6, 7 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా పురుషుల విభాగం క్రీడాకారులు చాంపియన్‌షిప్ సాధించినట్లు అథ్లెటిక్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి తెలిపారు. విష్ణువర్ధన్, వివేకానంద్, స్వామి, సంతోష్, సీహెచ్.పూజ, భార్గవి, నూరేన్, ఫైజాన్, నక్షత్ర, విక్రమ్, సాత్విక్‌లు జంప్స్, త్రోస్, రన్స్ విభాగాల్లో అద్వితీయ ప్రతిభ కనబరిచి, బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను అథ్లెటిక్ సంఘం బాధ్యులు హరికిషన్, రంగారెడ్డి, సర్దార్ భూషణ్ సింగ్, జగ్జీర్ సింగ్, రాజగోపాల్‌చారి, లక్ష్మణ్, చంద్రశేఖర్, రమేశ్ తదితరులు శనివారం అభినందించారు.

పలు క్లినిక్‌లలో ఆకస్మిక తనిఖీలు

- కనీస విద్యార్హత లేకుండా వైద్యం చేస్తున్నట్లు గుర్తింపు



తనిఖీ చేస్తున్న టీజీఎంసీ అధికారులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లోని పలు క్లినిక్‌లలో టీజీఎంసీ వైద్య బృందం అధికారులు డాక్టర్ రాజ్‌కుమార్ నేతృత్వంలో శనివారం తనిఖీలు చేపట్టారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని కొదురుపాక, కరీంనగర్ జిల్లాలోని బావుపేట గ్రామాల్లో కేవలం పదోతరగతి, ఇంటర్మీడియట్ చదివి, క్లినిక్‌లు నిర్వహిస్తూ వైద్యం చేస్తున్నట్లు గుర్తించారు. కొదురుపాక నీలోజిపల్లి గ్రామంలో కరుణ క్లినిక్ పేరిట జక్కని లక్ష్మీనారాయణ కనీస విద్యార్హత లేకుండా 25 ఏళ్లుగా వైద్యం అందిస్తున్నట్లు తేల్చారు. ఆ క్లినిక్‌లో అనేక రకాల ఇంజెక్షన్లు, యాంటీబయాటిక్స్, స్టిరాయిడ్స్ లభించాయి. ల్యాబ్ కూడా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అలాగే, బావుపేట ఆసిఫ్‌నగర్‌లో రీసా, వందన, సిటీ క్లినిక్‌లు, శ్రీవిషిక ల్యాబ్‌ను రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్నట్లు తేల్చారు. అయితే, తనిఖీల విషయం సోషల్ మీడియాలో తెలుసుకున్న ఇతర క్లినిక్‌ల నిర్వాహకులు వాటిని మూసేసి, పరారయ్యారు. చింతకుంటలో కె.భాస్కర్ నిబంధనలకు విరుద్ధంగా ఆనంద్ క్లినిక్ పేరిట క్లినిక్ అండ్ ల్యాబొరేటరీ నిర్వహిస్తున్నాడని తెలిపారు. వీరిపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. నేషనల్ మెడికల్ కమిషన్ చట్టం సెక్షన్ 34, 54 ప్రకారం అర్హత లేకుండా వైద్యం చేస్తే జైలుశిక్ష, జరిమానా విధిస్తారని పేర్కొన్నారు. తెలంగాణ వైద్య మండలికి చెందిన పలు బృందాలు అన్ని జిల్లాల్లో నిరంతర తనిఖీలు కొనసాగిస్తున్నామని, వచ్చీరాని వైద్యంతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే శిక్షలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. తనిఖీల్లో ఐఎంఏ మెంబర్ డాక్టర్ వంశీ, హెచ్ఆర్‌డీఏ సెక్రటరీ డాక్టర్ గౌతమ్, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి, యువకుడికి తీవ్ర గాయాలు



గాయపడిన రోషన్

గోదావరిఖని(రామగుండం): బైక్ అదుపుతప్పి పడిపోయిన ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. గోదావరిఖని విఠల్‌నగర్‌కు చెందిన సింగరేణి కార్మికుడు రాజు, కల్వల రోషన్ శనివారం ద్విచక్రవాహనంపై బస్టాండ్‌కు వెళ్తున్నారు. కోర్టు చౌరస్తా పైలాన్ వద్ద అకస్మాత్తుగా మరో వాహనం అడ్డువచ్చింది. ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో బైక్ అదుపుతప్పి, పడిపోయింది. ఈ ప్రమాదంలో వెనక కూర్చున్న రోషన్ తలకు తీవ్ర, బైక్ నడుపుతున్న రాజుకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను తొలుత సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. రోషన్ పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.



పుణ్యస్నానాలు.. పూజలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా గోదావరిలో స్నానాలు ఆచరించి, స్వామివారలను దర్శించుకున్నారు.